పద్మ అడిగింది డాక్టరేమన్నాడని.
పద్మకు ఏం సమాధానం చెప్పాలో తనకు అర్థం కాలేదు. అబద్ధాలు చెప్పి పద్మను నమ్మించటం తనకు చేతకాదు. ఇంత ఘోరమైన పరిస్థితుల్లో పద్మకు బతుకుకంటే చావే శాంతిని ప్రసాదిస్తుందేమో ననిపించింది. ఆ పరిస్థితుల్లో అసత్యాలతో పద్మను నమ్మించటం అవివేకమౌతుందేమో.

'కేస్ అంత హోప్‌ఫుల్ కాదన్నాడు పద్మా?' తన సమాధానం విని పద్మ నవ్వింది. 'మా బావ ఎప్పుడూ అబద్ధాలు

## నీడ నీనాడ నిజం

చెప్పడు'

స్పెషల్ వార్డులో చేరిపించి, చదువుకోవటానికి ఏవో పుస్తకాలు తెచ్చి సాయంత్రం నీకు తోడుగా రుక్మిణిని పంపుతాను, ఇక నేను వెళతాను పద్మా' అన్నాడు తను.

'నాకు ఒంటరిగా వుండుకోవటం అలవాటే బావా! మళ్లీ అక్కయ్యను కూడ ఈ నరకంలోకి ఈడ్వటం ఎందుకు? వట్టి మనిషి కూడ కాదు.'

'నీకు తెలియదు పద్మా, జబ్బుమనిషివి ఒంటరిగా వుండకూడదు.'

'నేను ఏ క్షణంలోనైనా చచ్చిపోతానని, నీకా భయం ఏమీ అక్కర్లేదు. నా ప్రాణం అంత తేలిగ్గా పోదు' అంది.

తను ఏం సమాధానం చెప్తుకుండా వరండాలోకి వచ్చినిలబడ్డాడు.'

'నా మాటలకు బాధపడుతున్నావా, నా విషయంలో అలాంటివి వదిలేసుకోవాలి. ఇక ఇంటికి వెళ్ళు. రుక్మిణి నీ కోసం ఎదురు చూస్తూవుంటుంది.'

తను ఇంట్లో అడుగు పెట్టేసరికి కేరియర్ పట్టుకుని రుక్మిణి సిద్ధంగా వుంది.

'ఎక్కడికే?'

'అక్కడికే'

'సరి'

రుక్మిణి కేరియర్ పట్టుకువెళ్లింది. ఆ రాత్రి తను ఒంటరిగా మిగిలిపోయాడు. రుక్మిణి తన జీవితంలో ప్రవేశించిన తరువాత ఒంటరిగా గడిపిన రాత్రులు చాల తక్కువ. నిద్రపట్టక మనసు పద్మకు సంభవించిన సంఘటనల చుట్టూ తిరగసాగింది.

* * *

ఎక్కాలురాని పద్మ మధు అనే ఏడేళ్ల మింగి ముఖం పిల్లాడిచేత రోజూ దెబ్బలు తినేది ఆ పిల్లాడు పద్మను దిబ్బ ముఖం పిల్లా అని పిలిచేవాడు.

ఆ మింగిముఖం పిల్లాడిదీ, ఆ దిబ్బ ముఖం పద్మదీ ప్రక్క ప్రక్క ఇళ్ళే. ఇంటికెళితే వరసయినవాళ్లంతా మొగుడూ పెళ్లాలు అని పిలిచేవాళ్ళు. వీళ్ల ఇద్దరూ నిత్యం దెబ్బలాడుకోవటానికి అదో ముఖ్యమైన కారణం.

ఒక సంవత్సరం కృష్ణాష్టమికి అనుకుంటాను వీళ్లిద్దరూ రాధాకృష్ణులు వేషం కడితే అంత ముక్కుమీద వేలేసుకున్నారు వీళ్ల దుంపతెగ అచ్చం మొగుడూ పెళ్లాల్లాగా వేషం కట్టేరు. ఎవరు చెప్పారు వీళ్లకివన్నీ అన్నారు.

దాంతో వాళ్లిద్దరు ఇంటా బయట మొగుడూ పెళ్లాలయ్యారు. మీ గోల మేం పడలేం అన్నట్టు ఆ ఏడాదే అయిదో క్లాసు అయిపోగానే మధుసూధనం హైస్కూలు కెళ్లిపోయాడు. పద్మ సరాసరి వంటింట్లో కెళ్లిపోయింది.



